www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
గురువారం 17 ఏప్రిల్ 2025

- చెట్ల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆదేశం
- లేకపోతే సీఎస్ సహా అధికారులంతా జైలుకే
- తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందా? అన్న అమికస్ క్యూరీ
- ఆ చట్ట ప్రకారమే చెట్ల నరికివేత చేపట్టినట్లు కోర్టుకు వివరణ
- విచారణ వాయిదా

5లో




# జైలుకు వెళ్తారా?

తెలంగాణ సర్కార్ కు సుప్రీంకోర్టు హెచ్చరికా!



## నన్ను అవుట్ చేస్తావా?

మా నాన్న రెండుసార్లు కౌన్సిలర్

- గొడవకు దారితీసిన క్రికెట్
- బాలుడిని చితకబాదిన మాజీ ప్రజాప్రతినిధి కొడుకు
- అనుచరులతో బాలుడి కుటుంబంపై మాజీ కౌన్సిలర్ దాడి?
- కాపాడాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం
- సిరిసిల్లలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

3లో




# దర్జాగా కబ్జా


- కబ్జాకు హస్తం నేతల అండ దండలు ఉన్నాయా?
- హైడ్రా అధికారులు ఎక్కడ?
- ప్రభుత్వ భూమిలో కాక సాగా!
- సర్వే నంబర్ 354 లో బడా నేత అక్రమ నిర్మాణాలు
- పేదలపై బ్రహ్మాస్త్రం... పెద్దల కబ్జాలకు అండ!

2లో

విధి నిర్వహణలో కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారుల ద్వంద నీతి!

- లాల్‌సాబ్‌గూడలో రూ.100 కోట్ల భూమికి ఎసరు!
- ప్రభుత్వ భూమి చుట్టూ ప్రైవేట్ వ్యక్తుల కంచె నిర్మాణం
- ప్రభుత్వ భూములకు రక్షణ ఎవరు?







# దర్జాగా కబ్జా

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** హైడ్రా వంటి బలమైన వ్యవస్థతో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు కళ్లెం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పని చేస్తున్నా.. అది నెరవేరడం లేదు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య ధోరణితో కళ్లముందే కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నది. తద్వారా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ నాయకులు ఘంతాపథంగా చెప్తుండగా బీఅర్ఎస్ కు చెందిన ఓ పేరు గాంచిన పెద్దమనిషి ప్రభుత్వ భూములను.. ప్రైవేట్ భూములుగా చిత్రీకరిస్తూ ఏకంగా రూ.100 కోట్ల విలువైనా భూమిని తన ఆధీనంలోకి తీసుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడు.

**పెద్దల కబ్జాలపై చర్యలు ఉండవా?**

కుత్బుల్లాపూర్ మండలం లాల్ సాబ్ గూడ సర్వే నంబర్ 354లో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి చుట్టు ముట్టూ రేకులతో కంచె ఏర్పాటు చేసి తమ ఆధీనంలో ఉన్న స్థలంలో పదికి పైగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న కబ్జాల పర్వంలో బీఆర్ఎస్ కు చెందిన ఓ బడా నేత ఉన్నట్టుగా స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎక్కడో ఓచోట ప్రభుత్వ భూమిలో నిరుపేదలు కాసింత గుడిసె వేసుకుంటేనే జేసీబీలతో కూల్చివేసి హడావుడి చేసే రెవెన్యూ అధికారులు ఈ ప్రాంతంలో ఖద్దరు నేతల కబ్జాలను మాత్రం చూసిచూడనట్టుగా వదిలేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.




**'హస్తం' నేతల అండ ఉందా?**

కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని 354 సర్వే నంబర్ లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నది. అక్కడ జరుగుతున్న కబ్జా వెనక ఓ బీఆర్ఎస్ నేత ఉన్నాడని జోరుగా ప్రచారం జరుగుతున్నది. అయినా రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం, అక్రమ నిర్మాణలను కూల్చకపోవడం పట్ల పలువురు సామాజిక ఉద్యమకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎవరన్నా కాంగ్రెస్ నేత సదరు కబ్జాదారులకు అండగా ఉండేలా వారికి అభయ 'హస్తం' ఏమన్నా అందించాడా? అని సర్వత్రా చర్చించుకుంటున్నారు. అందుకే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారా? అని చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారుల పని తీరుపై 354 సర్వే నంబర్ లోని ప్రభుత్వ భూముల కబ్జాల వ్యవహారంపై తీవ్ర విమర్శలు వెల్లివెత్తున్నాయి.

# గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ చైర్‌పర్సన్‌గా జయసుధ

## 15 మంది సభ్యులతో జ్యూరీ కమిటీ ఏర్పాటు

**కలంజ్యోతి, హైదరాబాద్ :** గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీ చైర్ పర్సన్‌గా ప్రముఖ సినీ నటి, మాజీ ఎమ్మెల్యే జయసుధ ఎంపికయ్యారు. మొత్తం 15 మంది సభ్యులతో కూడిన జ్యూరీ కమిటీని ఏర్పాటు చేశారు. జయసుధ, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్‌లతో ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ చిత్ర నిర్మాత దిల్ రాజు సమావేశమయ్యారు. నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డులకు ఇంతటి స్పందన రాలేదని ఆయన అభిప్రాయపడ్డారు. అవార్డుల కోసం దాఖలైన నామినేషన్లను ఈ నెల 21వ తేదీ నుంచి జ్యూరీ పరిశీలించనుంది. తెలంగాణ ఫిల్మ్ అవార్డుల కోసం అన్ని విభాగాల్లో కలిపి 1,248 నామినేషన్లు రాగా, వ్యక్తిగత కేటగిరీలో 1,172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరీలలో 76 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు.



# నన్ను అవుట్ చేస్తావా?

## మా నాన్న రెండుసార్లు కౌన్సిలర్



**కలంజ్యోతి, సిరిసిల్ల :** 'నా క్యాచ్ పడతావా..! మా నాన్న రెండుసార్లు కౌన్సిలర్.' అంటూ ఓ బాలుడు తోటి ఆటగాడిపై దాడికి పాల్పడ్డాడు. సరదాగా ఆడిన క్రికెట్ ఆట ఇద్దరు బాలుర మధ్య గొడవకు దారి తీసింది. ఆటను ఆటలాగే ఆడాలంటూ బాధిత బాలుడి తల్లి దాడికి పాల్పడిన బాలుడిని మందలించింది. మందలించిన ఆ మహిళపై ఆ బాలుడు నోటికి వచ్చిన బూతులు తిట్టాడు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన ఒక మాజీ ప్రజాపతినిధి.. ముఠా నాయకుడై ఆ బాధిత కుటుంబాన్ని చితకబాదిన ఘటన సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది.

**గొడవకు దారితీసిన క్రికెట్..**

సిరిసిల్ల పట్టణం గాంధీనగర్ లో మూడు రోజుల క్రితం ఆదివారం సెలవు రోజు కావడంతో బాలలు సరదాగా క్రికెట్ ఆడేందుకు గ్రౌండ్ కు వెళ్లారు. ఆ ఆట సరదా కాస్త ఇద్దరి బాలుర మధ్య రగడ పుట్టించి, మాజీ కౌన్సిలర్ తన అనుచరులతో బాధిత కుటుంబంపై దాడికి దిగేలా పురిగొల్పింది. సిరిసిల్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్ కొడుకు బబ్బి తన స్నేహితులతో కలిసి కోర్టు ఆవరణలో గల మైదానంలో క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మాజీ కౌన్సిలర్ కొడుకు కొట్టిన బాల్, కీపర్ గా వ్యవహరిస్తున్న అన్నల్దాస్ భార్గవ్ అనే బాలుడు క్యాచ్ పట్టి అవుట్ అని అరిచాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన బబ్బీ 'మా నాన్న రెండు సార్లు కౌన్సిలర్ నన్ను అవుట్ చేస్తావా' అంటూ... బ్యాటుతో భార్గవ్ ని చితకబాదాడు. విపరీతంగా దెబ్బలు తగలడంతో తోటి స్నేహితులు బాలుడి తల్లి ఉషాకి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తల్లి ఎందుకు కొట్టావంటూ అడగడంతో నన్నే అడుగుతావా? అంటూ ఆ తల్లిని ఇష్టరాజ్యాంగ బూతులు తిడుతూ బబ్బి దౌర్జన్యానికి పాల్పడ్డాడు.

**సర్వత్రా విమర్శలు..**


సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగపడవలసిన కమ్యూనిటీ హాల్ ఇక్కడ మాత్రం మాజీ కౌన్సిలర్ అనుచరులకు అడ్డాగా మారిపోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. విచ్చలవిడిగా మద్యం, గంజాయి సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారనీ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.



### ప్రాణ హాని ఉంది

**– బాధిత కుటుంబం..**

ఈ సందర్భంగా బాధిత కుటుంబం మాట్లాడుతూ.. ఇప్పటికీ మాజీ కౌన్సిలర్, ఆయన అనుచరులు ద్విచక్ర వాహనాలతో తమ ఇంటి చుట్టూ తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. మాజీ కౌన్సిలర్ అనుచరులతో తమకు, తమ కుటుంబానికి ప్రాణభయం ఉందన్నారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ప్రాణ భయం నుంచి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.



FIRST INFORMATION REPORT


(Under section 173 and 176 BNSS)

T.S.P.M. Orders 470,500

1. District: Rajanna Sircilla  P.S.: Sircilla Town  Year: 2025  FIR No.: 188/2025  Date: 06-04-2025
2. Acts & Section(s): 118(1),292,352,351(2),115(2),3(5) BNS
3. a) Occurrence of Offence: Day: Sunday  Date & Time From: 06-04-2025 16:30:00
   Date & Time To:  Prior To:  Time Period:
   b) Information Received at P.S.: Date & Time: 06-04-2025 21:00:00
   General Diary Reference: Entry No: 1  Date & Time: 06-04-2025 21:00:00
4. Type of Information: Written
5. Place of Occurrence:
   a) Distance and Direction From P.S.: 2 KM, North  Beat No.: Gandhinagar
   b) Address  Place: In the Court  Area/Mandal: Sircilla  Street/Village:
   City/District: Rajanna Sircilla  State: Telangana  PIN:
   c) In case, outside the limit of this Police Station, then
   Name of P.S.:  District:
6. Complainant / Informant:
   a) Name: Annaldas Usha
   b) Father's /Husband's Name: Late Sathish
   c) Date/Year of Birth:  Age: 40 Years
   d) Nationality: India  e) Caste: Padmasali
   f) Passport No:  Date of Issue:  Place of Issue:
   g) Occupation:  Mobile No.: 8019942042
   h) Address  House No:  Area/Mandal: Sirsilla  Street/Village: Gandhinagar
   City/District: RAJANNA SIRCILLA  State: TELANGANA  PIN:

### కేసు నమోదు..

ఈ క్రమంలోనే ఆ నోట ఈ నోట సమాచారం కాస్త ఆ మాజీ ప్రజాప్రతినిధికి చేరడంతో ఆగ్రహంతో ఊగిపోయాడు. తన అనుచరులతో ఏకంగా బాధిత బాలుడి కుటుంబంపై దౌర్జన్యానికి దిగాడు. కుటుంబాన్ని బూతులు తిడుతూ దౌర్జన్యానికి పాల్పడి బాలుడు బంధువులను సైతం చితకబాదాడు. పిల్లలకు గొడవ జరుగుతే నచ్చ జెప్పాల్సిన మాజీ కౌన్సిలర్ దౌర్జన్యానికి దిగడంతో బాధిత కుటుంబం నివ్వరపోయింది. అయినా తన అనుచరులతో కలిసి కుటుంబంపై దౌర్జన్యం చేశాడని, భయాందోళనలో ఉన్న బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. బాధితుల ఫిర్యాదు మేరకు తండ్రి కొడుకులతో సహా మరికొందరిపై సిరిసిల్ల పోలీస్ స్టేషన్ లో పోలీసులు కేసు నమోదు చేశారు.



## యువకుడి రక్తదానం

**కలంజ్యోతి, మల్యాల :** జగిత్యాల పట్టణంలో మోతె గ్రామానికి చెందిన బీమ లత అనే మహిళకు జగిత్యాల్లోని ప్రభుత్వ దవాఖానలో ఆపరేషన్ కోసం ఓ పాజిటివ్ రక్తం అవసరం అని డాక్టర్స్ చెప్పారు. దీంతో పేషెంట్ కుటుంబ సభ్యులు మల్యాల మండల చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు దూడం రామాంజనేయులుని సంప్రదించడంతో పోతారం గ్రామానికి చెందిన కంటే అరుణ్ కి ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో అరుణ్ వెంటనే స్పందించి జగిత్యాల వెళ్లి రక్తదానం చేసి మహిళను ఆదుకున్నాడు.



# హోటళ్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

## కేసులు నమోదు

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు రెస్టారెంట్లు, తినుబండారాల తయారీ కేంద్రాలు, మిఠాయిల డ్రై ఫ్రూట్స్ దుకాణాలలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ బృందం బుధవారం సాయంత్రం ఆకస్మిక సోదాలు నిర్వహించింది. ఈ ఫుడ్ సేఫ్టీ సోదాల్లో భాగంగా పట్టణంలోని మయూరి హోటల్, బంధన్ స్వీట్ షాప్, దత్తత్రేయనగర్ లోని డ్రై ఫ్రూట్ హౌస్, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు నిర్వహించిన రెస్టారెంట్లలో వంట గది, రిఫ్రిజిరేటర్ లు పూర్తిగా అపరిశుభ్రంగా ఉండడం ఫుడ్ సేఫ్టీ అధికారులు గమనించారు. సుమారు రూ.10 వేల విలువైన నిలువ చేసిన కుళ్ళిన మాంసపు ఉత్పత్తులను, హానికర, ప్రమాదకరమైన రంగులను కలిపిన చికెన్, కాలం చెల్లిన సాస్, లేబుల్ డిఫెక్ట్స్ కలిగిన పన్నీర్, పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ ఉంచిన కూరగాయలను గుర్తించారు. పట్టణంలోని ఐఫ్ఫి రెస్టారెంట్ లో స్టోర్ రూమ్ లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో ఎలుకల విసర్జితాలతో కూడిన సుమారు రూ.5 వేల విలువైన ముడి సరుకులను గుర్తించి హోటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆ వస్తువులను ధ్వంసం చేసి, ఎఫ్ఎస్ఎస్ చట్టం 2006 ను పాటించనందుకు నోటీసులను జారీ చేశారు. దత్తాత్రేయనగర్ లో డ్రై ఫ్రూట్ హౌస్ లో తనిఖీ చేయగా నిర్వాహకులు ఎటువంటి పరిశుభ్రత ప్రమాణాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, అధిక మోతాదులో రంగులు కలిపిన ఆహార పదార్థాలను, లేబుల్ డిఫెక్ట్స్ కలిగిన రెడీ టు ఈట్ సేవరిస్ అయిన ఖారా, మురుకులు, పచ్చి బఠాని ఇతర అనుమానిత ఆహార పదార్థాల శాంపిళ్లను పరీక్ష నిమిత్తం హైదరాబాదు ల్యాబ్ కు పంపించామని అధికారులు తెలిపారు. ప్రజల ప్రాణాలకు నష్టం కలిగించేలా హానికర ఆహార పదార్థాలను విక్రయించవద్దని, నాణ్యతా ప్రమాణాలను పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ ఆహార నాణ్యత తనిఖీల్లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి, టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్ రోహిత్ రెడ్డి ,స్వాతి, శ్రీశిక, జగన్నాధం పాల్గొన్నారు.

కలంజ్యోతి
గురువారం 17.04.2025 General News



## టెక్స్ టైల్స్ పార్కు సందర్శన

**కలంజ్యోతి, గీసుగొండ :** గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పార్కు ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. గణేష్ ఏకో టెక్ కంపెనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## హారన్ కొట్టినందుకు కత్తెరతో దాడి

**కలంజ్యోతి, గీసుకొండ :** మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన బేబీర్ యుగంధర్ పై గుర్తు తెలియని వ్యక్తి కత్తెరతో దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే ఎంజీఎం నుంచి తన టాటా ఎస్ డ్రైవింగ్ చేస్తున్న తరుణంలో ముందుగా ఆటో వెళ్తుంటే హారం కొట్టాడు. దీంతో అతడి వెంబడించి భద్రకాళి క్రాస్ వద్ద ఆపి హారన్ ఎందుకు కొట్టావని దుర్భషలాడి.. ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న పూల షాప్ వద్ద కత్తెర తీసుకొని యుగంధర్ మెడభాగంలో పొడిచాడు. దీంతో బాధితుడికి తీవ్ర రక్తస్రావం కావడంతో గమనించిన స్థానికులు ఎంజీఎంకు తరలించారు. ఈ విషయమై బాధితుడి భార్య మట్టేవాడ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## బీఆర్ఎస్ హత్నూర మండల అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి



**కలంజ్యోతి, నర్సాపూర్ :** బీఆర్ఎస్ హత్నూర మండల అధ్యక్షుడిగా కొన్యాల గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఉమన్నగారి దేవేందర్ రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ ఎన్నికను ప్రకటించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు మండల పార్టీ అధ్యక్ష పదవి అప్పజెప్పినందుకు ఎమ్మెల్యే సునీతారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్తను కలుపుకొని పోయి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల మార్క్ అవుట్ వేగవంతం చేయండి

### కలెక్టర్ అభిలాష అభినవ్



**కలం జ్యోతి, నిర్మల్ :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మార్క్ అవుట్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియ, వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ఆమె సంబంధిత అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన ఇందిరమ్మ ఇండ్ల మార్క్ అవుట్ వివరాలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆమె మండలాల వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తొలి దశలో ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల మార్క్ అవుట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇండ్ల మార్క్ అవుట్ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల అర్హతలు, జీఓకి సంబంధించిన వివరాలపై ఇందిరమ్మ ఇళ్ల కమిటీల సభ్యులకు అవగాహన కల్పించేందుకు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ పనులు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకే నిర్వహించాలని, పనుల ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ పొట్లాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని 117 ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధి హామీ నిధుల ద్వారా 228 మరుగుదొడ్లను మంజూరు చేశామని, వాటి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మండల కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు అవసరమైతే తగిన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓలు రత్నకల్యాణి, కోమల్ రెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీఓ శ్రీనివాస్, ఈఈ ఆర్డబ్ల్యూఎస్ సందీప్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

- లబ్ధిదారు ఇంటిలో భోజనం
- ఆనందగా ఉందన్న రేవూరి





**కలంజ్యోతి, గీసుకొండ :** మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన సన్నబియ్యం లబ్ధిదారు దౌడు సంపత్ రాజకుమారి ఇంట్లో కలెక్టర్ సత్య శారద, అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవుల ప్రకాశ్ రెడ్డి భోజనం చేశారు. అనంతరం లబ్ధిదారులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ చారిత్రకమైన నిర్ణయం అన్నారు. సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. సన్నబియ్యం సరఫరాలో అవకతవకలకు తావివ్వ కుండా చూడాలని అధికారును ఆదేశించారు. త్వరలో ఇందిరమ్మ అభయహస్తం పేరుతో తొమ్మిది రకాల సరుకులు పంపిణీ చేయ బోతున్నామని వెల్లడించారు. పేదవాడి కడుపు నింపేందుకు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

కలంజ్యోతి 5
గురువారం 17.04.2025 General News

# జైలుకు వెళ్తారా?

- చెట్ల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆదేశం
- లేకపోతే సీఎస్ సహా అధికారులంతా జైలుకే
- తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందా? అన్న అమికస్ క్యూరీ
- ఆ చట్ట ప్రకారమే చెట్ల నరికివేత చేపట్టినట్లు కోర్టుకు వివరణ
- విచారణ వాయిదా



**న్యూఢిల్లీ:** వంద ఎకరాల్లో చెట్లు నరికివేసిన ప్రాంతంలో పూర్వ స్థితికి చర్యలు చేపట్టాలని తెలంగాణ సర్కార్ ను సుప్రీంకోర్టు ఆదేశించింది. చెట్ల నరికివేతకు అనుమతులున్నాయా అని ప్రశ్నించింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మొత్తం పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఎంపవర్డ్ కమిటీని అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించగా.. ఈ మేరకు బుధవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ తో ద్విసభ్య ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. అయితే, విచారణ సందర్భంగా కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేతపై కోర్టు మరోసారి సీరియస్ అయింది. చెట్ల నరికివేతపై జస్టిస్ గవాయి, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాగే, వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పండి అని ప్రశ్నించింది. తదుపరి విచారణ మే 15కు వాయిదా వేసింది.

**ప్రభుత్వానికి చురకలు అంటించిన సుప్రీం**

విచారణ సందర్భంగా ధర్మాసనం.. చెట్ల నరికివేతపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. దీన్ని సమర్థించుకోవద్దంటూ చురకలు అంటించింది. వాటిని ఎలా పునరుద్ధరణ చేస్తారో చెప్పండి.. లేదంటే అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించింది. చెట్ల నరికివేతకు అనుమతి తీసుకున్నారా? సూటిగా జవాబు చెప్పండి అంటూ ప్రశ్నించింది. వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారు.. పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీలేదు. వీడియోలు చూసి మేము ఆందోళనకు లోనయ్యాం. అభివృద్ధి, పర్యావరణానికి మధ్య సమతుల్యం అవసరం. ఇష్టం వచ్చినట్టు పర్యావరణాన్ని ధ్వంసం చేస్తామంటే ఊరుకోం. వాటిని ఎలా పునరుద్ధరిస్తారో చెప్పండి.. లేదంటే చెరువు దగ్గరే తాత్కాలిక జైలు పెట్టి అధికారులను అక్కడే ఉంచుతామని హెచ్చరించింది.

**మీ సొంత పనుల కోసం రూల్స్ అతిక్రమించారు**

'షెల్టర్ కోసం జంతువులు పరుగులు తీస్తే.. వాటిని వీధి కుక్కలు తరిమాయి. 1996లో మేము ఇచ్చిన తీర్పుకు భిన్నంగా అధికారులు సొంత మినహాయింపులు ఇస్తే వారే బాధ్యులు అవుతారు. ప్రైవేట్ ఫారెస్టులో సైతం చెట్లు నరికితే సీరియస్‌గా పరిగణిస్తాం. భూముల తాకట్టు అంశాలతో మాకు సంబంధం లేదు. కేవలం నరికిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలి. డజన్ల కొద్ది బుల్డోజర్లతో అడవిలో వంద ఎకరాలు తొలగించారు. మీరు అభివృద్ధి చేసుకోవాలనుకుంటే తగిన అనుమతులు తీసుకోవాలి. సిటీలో గ్రీన్ లంగ్ స్పేస్ ఉండాలి. వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు' అని ప్రశ్నించింది. పర్యావరణ, వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెబుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అప్పటివరకు యథాతథ స్థితి కొనసాగించాలని తెలిపింది. తదుపరి విచారణ మే 15కు వాయిదా వేసింది.

**ప్రభుత్వ వాదనలు**

కంచగచ్చబౌలి భూముల్లో అన్ని పనులు ఆపేశాం. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకుంటాం. ఫేక్ వీడియోలతో తప్పుడు ప్రచారం చేశారు. మినహాయింపులకు లోబడే మేము కొన్ని చెట్లు తొలగించాం అని తెలిపారు. అమికస్ క్యూరీ వాదనలు వినిపిస్తూ.. సెల్ఫ్ సర్టిఫికేషన్ చేసుకుని.. అన్నింటికీ మినహాయింపులు ఇచ్చుకున్నారు. ఇది సుప్రీం తీర్పునకు విరుద్ధం. ఈ భూములు తాకట్టుపెట్టి ప్రభుత్వం అప్పులు తెచ్చుకుందన్నారు.





## స్మితా సభర్వాల్‌కు నోటీసులు

### హెచ్ సీయూ భూముల విషయంలో అసత్య ప్రచారంపై చర్యలు

**కలంజ్యోతి, హైదరాబాద్ :** సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర పర్యటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ కు తెలంగాణ పోలీసులు షాకిచ్చారు. కంచ గచ్చిబౌలి భూములపై తప్పుడు ప్రచారం విషయంలో బుధవారం ఆమెకు నోటీసులు జారీ చేశారు. హెచ్ సీయూకు ఆనుకుని ఉన్న కంచగచ్చిబౌలి భూముల విషయంలో సోషల్ మీడియా వేదికగ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అక్కడ పర్యావరణ విధ్వంసం, జంతుజాలం ఆవాసం కోల్పోయాయని నెటిజన్లు రకరకాల వీడియోలు ఫొటోలు షేర్ చేశారు. వాటిలో చాలా వరకు ఫేక్, ఏఐ ఆధారిత ప్రచారమే ఉందని ప్రభుత్వం చెప్పడంతో తాము చేసిన పోస్టులను చాలా మంది తొలగించారు. అయితే మార్చి 31న హాయ్ హైదరాబాద్ అనే ఎక్స్ (ట్విట్టర్) హ్యాండిల్ పోస్టు చేసిన ఓ ఇమేజ్ ను స్మితా సభర్వాలా రీ ట్వీట్ చేశారు. హెచ్ సీయూ లోపల ఉన్న మష్రూమ్ రాక్ ముందు భారీ సంఖ్యలో బుల్డోజర్లు వాటి ముందు నెమలి, జింకను గిబ్లీ శైలిలో ఉన్నట్లు ఆ ఇమేజ్ ఉంది. ఈ పోస్టుని స్మితా సబర్వాల్ రీ ట్వీట్ చేయగా ఇది ఫేక్ ఇమేజ్ అని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ పోస్టును రీ ట్వీట్ చేసిన స్మితా సభర్వాల్ కు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఆమెకు నోటీసులు జారీ చేసినట్లు గచ్చిబౌలి పీఎస్ఎస్ హెచ్ వో మహ్మద్ హబీబుల్లా ఖాన్ బుధవారం మీడియాకు వివరించారు. అయితే బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఒక కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసుల అధికారి సాక్షులను పోలీస్ స్టేషన్ కు పిలిపించి వారి వాంగ్మూలాలను నమోదు చేసుకునే అవకాశం ఉంది.

# పిచ్చి కామెంట్లు పెట్టొద్దు



నటి వర్ష బొల్లమ్మ సతురన్ అనే తమిళ సినిమాతో కెరియర్ స్టార్ట్ చేసి ఆ తర్వాత కల్యాణం అనే చిత్రంతో మలయాళీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. 2020లో చూసి చూడంగానే సినిమాతో వర్ష తెలుగులోకి అడుగుపెట్టింది. మూడు భాషలలో ఈ భామ మంచి యాక్టర్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. దర్శకుడు అట్లీ దర్శకత్వంలో దళపతి విజయ్ హీరోగా 2019లో విడుదలైన 'బిగిల్' సినిమాలో వర్ష బొల్లమ్మ ఓ ముఖ్య పాత్రలో కనిపించింది. ఈ పాత్రతో వర్ష అందరి దృష్టిని ఆకర్షించింది. 'జాను', 'మిడిల్ క్లాస్ మెలోడీస్', 'పుష్పక విమానం', 'స్వాతిముత్యం', 'ఊరి పేరు భైరవకోన' లాంటి చిత్రాల్లో మెరిసి తన నటనతో ఆకట్టుకుంది వర్ష. వర్ష బొల్లమ్మ కురచ దుస్తులతో దిగిన ఫొటోలు షేర్ చేస్తూ.. అదిదా సర్‌ప్రైజ్.. ప్యాంట్ ఎక్కడా అటూ స్టుపిడ్ కామెంట్స్ చేయొద్దు. పంత్ ఇప్పుడు లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో ఉన్నాడు అంటూ కాస్త తెలివిగా స్పందించింది. తనని ఎలాగు ప్యాంట్ మరిచిపోయా అని అడుగుతారు కాబట్టి ముందుగానే తన వర్షన్‌లో తెలివిగా రాసుకొచ్చింది. వర్ష ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా తన అప్డేట్స్ ని షేర్ చేసుకుంటూ ఉంటుంది. దీంతో ఇన్ స్టాగ్రామ్ లో వర్షకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్నది. ఆమె ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ పిక్స్ కంటే డిఫరెంట్ స్టైల్ లో తనని తాను రిప్రజెంట్ చేసుకుంటూ వెరైటీ ఫొటోలు షేర్ చేస్తూ ఉంటుంది. ఈ పిక్స్ ఫ్యాన్స్ కి వినోదాన్ని అందిస్తూ ఉంటాయి.